యంత్రాంగం పనితీరుపై చైర్మన్‌కు ఫిర్యాదులు
హర్షవర్ధన్ స్పందించాలని వినతి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక పురపాలిక అధికారులు, సిబ్బంది పని తీరు అధ్వాన్నంగా ఉందంటూ సాక్షాత్తు మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డికి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఆయన ఎలాంటి చర్యలకు ఉపక్రమిస్తారోనని పట్టణ ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. మున్సిపల్ కార్యాలయానికి సంబందించి ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని ఎప్పుడు పడితే అప్పుడు రావడం, ఇష్టం వచ్చినప్పుడు వెళ్లడం జరుగుతోందని సందర్శకులకు సరైన సమాధానం చెప్పడం లేదని సమస్యలపై స్పందన కరువైందన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వస్తిమమ్మా-పోతిమమ్మా అన్న తరహాలో వారు విధులు నిర్వహిస్తున్నారన్న అభిప్రాయం బలంగా ఉంది. ఫలితంగా పురపాలిక పరిధిలో బోలెడు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని పలువురు గుర్తుచేస్తున్నారు. ప్రజాధనాన్ని జీతంగా పుచ్చుకుంటూ నిర్దేశించిన మేరకైనా తమ విధులను సక్రమంగా నిర్వర్తించని ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలకు ఉపక్రమిస్తే తప్ప ఫలితం ఉండదని కొందరు చైర్మన్ వద్ద స్పష్టం చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మరి ఆ దిశగా చైర్మన్ ఏ మేరకు స్పందిస్తారో వేచిచూద్దాం. ఇదిలా ఉండగా మున్సిపల్ ఆర్ఓ గంగిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ దాశరథి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ మంగళవారం చైర్మన్‌తో భేటీ అయి పలు అంశాలపై చర్చించారు.

ఘనంగా బండెన్న స్వామి 21వ వార్షికోత్సవం

విశాలాంధ్ర- బి.కొత్తకోట: బిరంగిగ్రామం గూగుట్ట కోనలో వెలసిన బండెన్న స్వామి 21 వ వార్షికోత్సవం మంగళవారం ఆలయ ధర్మకర్త పీఠాధిపతి లక్ష్మీపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర తో పాటు కర్ణాటక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు వచ్చిన భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలతో పాటు భోజనం వసతి కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బండెన్న స్వామి వార్షికోత్సవాలు ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో దేవాలయం మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

కుట్రలు, కుతంత్రాలతో పాలన: మాజీ ఎమ్మెల్యే వరద

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: కుట్రలు, కుతంత్రాలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి విమ ర్శించారు. మంగళవారం స్థానిక శివాలయం సెంటర్‌లోని శిబిరం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక నేరగాళ్లు రాష్ట్రాన్ని పాలిస్తే రాష్ట్రం అధోగతి పాలు అవుతుందన్నారు. ఆర్థిక నేరారోపణలతో 16నెలలు జైలులో ఉన్న జగన్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అక్రమ కేసు పెట్టి జైలుకు పంపడం, జగన్ చేసే కుట్రలు, కుతంత్రాలు రాష్ట్ర ప్రజలు గమనిస్తు న్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వస్తూనే ప్రజావేదిక కూల్చారని, అన్నా క్యాంటీన్లు మూసివేశారని, టిడ్కో ఇళ్లు పేదలకు ఇవ్వలేదన్నారు. అలాగే అమరావతి రాజధాని కోసం రైతులు భూములిస్తే రాజధాని లేని రాష్ట్రంగా తయారుచేశారన్నారు. కేవలం ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపడం అడ్డుఅదుపు లేకుండా నియంత పాలన సాగించాలనుకోవడం పొరపాటు అని, హిట్లర్ లాంటి వాళ్లు మట్టి కరుచుకుపోయారని ఇది జగన్ గుర్తించుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఇసుకమాఫియ, లిక్కర్‌మాఫియ, భూమాఫి యా, ఎర్రచందనం అక్రమ రవాణా తదితర అసాంఘిక కార్యకపాలను పెంచి పోషిస్తూ ముఖ్యమంత్రి మొదలు ఎమ్మెల్యేలు, మంత్రులు అక్రమ సంపాదనలో కూరుకుపోయారన్నారు. రాష్ట్ర ప్రజలు తేదేపా ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి బేరీజు వేసుకుంటున్నారని ప్రజలే ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్తారన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, మాజీ మున్సిపల్‌చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, ఘంటసాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తవ్వా ఓబుల్ రెడ్డి జీవితం, సాహిత్యంపై వైవియూలో పరిశోధన

విశాలాంధ్ర - మైదుకూరు : కడప జిల్లా ఖాజీపేట మండలం బక్కాయపల్లె చెందిన కథా రచయిత తవ్వా ఓబుల్ రెడ్డి జీవితం- సాహిత్యం అనే అంశం యోగి వేమన యూనివర్సి టీలో పిహెచ్ డి పరిశోధనకు ఎంపికైంది. మైదుకూరులోని జడ్పీ ఉన్నతపాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా ఓబుల్ రెడ్డి పనిచేస్తున్నారు. పాతికే ళ్లుగా రచనలు చేస్తున్న తవ్వా ఓబుల్ రెడ్డి చరిత్రకారుడి గా, పాత్రికేయుడిగా జిల్లావాసులకు, సాహితీ లోకానికి చిరపరిచితులు. ఇటీవల 'కడుపాత్రం' కథాసంపుటిని వెలువరిం చారు. తవ్వా ఓబుల్ రెడ్డి రచించిన 'గండికోట' అనే చరిత్ర పరిశోధనాత్మక పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకానికి 2013లో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ పర్యాటక గ్రంథంగా పురస్కారం లభించింది. అలాగే 'కడపకథ ' పేరుతో కడప జిల్లా రచయితలు రాసిన 48 కథల సంకలనానికి సంపాదకత్వం వహించారు. 'రాయలసీమ వైభవం', తెలుగు పౌరుషం, 'సంగీతపరిచయ దీపిక' అనే పుస్తకాలను సంకలనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వపాఠ్యపుస్తకాల రచయితల బృందం సభ్యునిగా 3, 6, 7 తరగతుల తెలుగు పుస్తకాల రూపకల్పనలో పాల్గొన్నారు. అనేక కవితలు, వ్యాసాలను రచించారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య లో ఓబుల్ రెడ్డికి ప్రాతినిథ్యం ఉంది. 2022 లో రాష్ట్ర ప్రభుత్వం చే 'గిడుగు పురస్కారం' తో పాటు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. పలు కథా సంకలనాల్లో ఈయన కథలు చోటు చేసుకున్నాయి.ఈ నేపథ్యంలో ఓబుల్ రెడ్డి జీవితం, రచనలను పిహెచ్ డి పరిశోధనలకు ఎంపిక చేసినట్లు యూనివర్సిటీ నుంచి ఆయనకు సమాచారం అందింది. ఈ సందర్భంగా రచయిత తవ్వా ఓబుల్ రెడ్డి వైవియు వైస్ ఛాన్సలర్ చింతా సుధాకర్ కు, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి వెంకటసుబ్బయ్యకు, పరిశోధన పర్యవేక్షకులు ఆచార్య పి. రమాదేవికి, సి.పి బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణ ప్రతిపాదనలు త్వరితగతిన సమర్పించాలి

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కు సంబంధించిన ప్రతిపాదనలను త్వరితగతిన సమర్పించాలని జిల్లా కలెక్టర్ గిరీష పి.ఎస్, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలు ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం, కలెక్టర్, జేసీ, డిఆర్ఓ బంగ్లాల నిర్మాణం అంశాలపై ఆర్ అండ్ బి అధికారులు, ఐసీసీ కన్సల్టెన్సీ ఏజెన్సీ ప్రతినిధులతో కలెక్టర్, ఎమ్మెల్యేలు కలిసి సమావేశం నిర్వహించారు. ముందుగా మంగళవారం ఉదయం ఆర్ అండ్ బి అధికారులు, ఐసీసీ కన్సల్టెన్సీ ప్రతినిధులు కలెక్టరు, జేసి, డిఆర్ఓ బంగ్లాలు మరియు ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మించనున్న స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కలెక్టర్ నిర్వహించిన సమావేశంలో.. భవనాలను ఎంత విస్తీర్ణంలో నిర్మించనున్నారు, ఆ భవనాల ఆకృతులు, ల్యాండ్ స్కేపింగ్, రహదారుల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలలో అధికారులతో చర్చించి అందుకు సంబంధించిన మ్యాపులను కలెక్టర్, ఎమ్మెల్యేలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. అలాగే కలెక్టర్ బంగ్లా నిర్మాణానికి కూడా పరిపాలన అనుమతుల మంజూరు కోసం వెంటనే ప్రతిపాదన సమర్పించాలని కలెక్టర్ ఆర్ అండ్ బి కారులతో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ ఈఈ సహదేవరెడ్డి, డి ఈ వెంకటసుబ్బయ్య ఏఈ గిరీశ్వరావు, ఐసీసీ కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని నిర్మించాలి: సీపీఐ

విశాలాంధ్ర-కడప రూరల్ : జిల్లా రిజిస్టర్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కేటాయించిన పాత రిమ్స్‌లో తక్షణం నిర్మించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దస్తావేజులేఖరిలో వృత్తి పరిరక్షణ సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటి వేణుగోపాల్, నగర అధ్యక్షులు యు సంజీవ రాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పాత రిమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మైనారిటీ శాఖ మంత్రి ఎస్.బి. అంజద్ భాషకి వినతి పత్రం ఇవ్వడం జరిగినది. ఈ సందర్భం గా జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1864 సంవత్సరంలో ప్రారంభమైన కడప జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ఆవరణంలో పెట్రోల్ బంకు నిర్మాణం చేపట్టడం జరిగిందని ఆస్థానములో రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని నిర్మించాలని అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా రిజిస్టర్ పీవీఎన్ బాబు, రెవిన్యూ డివిజనల్ మండల తాసిల్దార్ దృష్టికి వివిధ ఆందోళన కార్యక్రమాల ద్వారా తీసుకుపోవడం జరిగిందన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయ స్థలాన్ని పెట్రోల్ బంకు కేటాయించడంపై రాష్ట్ర కమిషనర్ మరియు ఇన్స్పెక్టర్ జనరల్ వారి దృష్టికి తీసుకుపోవడం జరిగిందని అన్నారు.జిల్లా రిజిస్టర్ పి.వి.ఎన్. బాబు స్పందించి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ని కోరగా వారు పాత రిమ్స్‌లో స్థలం కేటాయించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కడప వారికి ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని ఆ స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ శాఖకు అప్పగించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికారులు చొరవ చూపి రిజిస్ట్రేషన్ కార్యాలయ నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైమ్ 2.0 విధానం వలన ప్రజల ఆస్తులకు భద్రత ఉండదని దస్తావేజు లేఖరుల వ్యవస్థ కనుమరుగవుతుందని ఈ విధానం వలన దస్తావేజు లేఖరులు, స్టాంపులు వెండర్లు, డిటిపి ఆపరేటర్లు, లేఖరుల సహాయకులు జీవనోపాధి కోల్పోయి రాష్ట్రవ్యాప్తంగా లక్ష కుటుంబాలు వీధుల పాలు అవుతాయన్నారు. ఈ విధానం పైన రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి లేఖర్ల వ్యవస్థకు జీవనోపాధికి ఇబ్బంది కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు మైనారిటీ శాఖ మాత్యులు అంజద్ భాషాని కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో రామ కృష్ణారెడ్డి, వై సుబ్బరాయుడు, లోకనాథం, సుబ్బారెడ్డి, మహేష్, యాకోబ్, గుంటి వెంకట సాయినాథ్, ఇక్బాల్ ,ఓబుల కొండయ్య, అబ్దుల్ వహాబ్ పాల్గొన్నారు.

'బాబు' క్షేమానికై పూజలు

- అరాచకంపై గర్జనలు
- నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ శ్రేణుల నిరసనలు
- అధినేతకు అండగా అలుపెరుగని పోరు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : సీఎం జగన్‌మోహన్ రెడ్డివి అన్నీ కక్షసాధింపు చర్యలే. అందుకే చేయని తప్పునకు నిందలు మోపుతున్నారు. లేనిపోని కేసులు బనాయించి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబును అక్రమంగా అరెస్టు చేయించారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా చివరకు న్యాయమే గెలుస్తుంది అని తెలుగు తమ్ముళ్లు నినదించారు. బాబు అక్రమ అరెస్టు, రిమాండ్‌ను నిరసిస్తూ 'బాబుతో నేను- బాబుకోసం మేము' అంటూ చేపట్టిన సామూహిక రిలే దీక్షలు నియోజకవర్గ కేంద్రమైన జమ్మలమడుగు గాంధీ కూడలిలో మంగళవారం కూడా కొనసాగాయి.

బాబు క్షేమానికై పూజలు: చంద్రబాబునాయుడు క్షేమాన్ని కాంక్షిస్తూ ఆయన వెంటనే విడుదల కావాలని కోరుతూ మంగళవారం తెలుగుదేశం పార్టీ శ్రేణులు స్థానిక నడిఊరు రామాలయం, పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి బాబు పేరిట అర్చన చేయించారు. నియోజకవర్గ పార్టీ బాధ్యులు చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి హాజరైన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపేష్ మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపులో భాగంగా చంద్రబాబును వేధింపులకు గురి చేస్తున్నారని దుయ్యపట్టారు. రాష్ట్రంలో విపక్ష పార్టీలను లేకుండా చేయాలనే దుష్ట పన్నాగంతో వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. నేటి నుండి గ్రామాల్లో పర్యటిస్తూ ప్రతి ఇంటి వద్దకు వెళ్లి చంద్రబాబు అక్రమ అరెస్టు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త, నాయకులు తమ వంతు బాధ్యతతో వ్యవహరిస్తూ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు సైనికుల్లా పోరాడాలని భూపేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మండల పార్టీ పర్యవేక్షకులు చదిపిరాళ్ల జయరామిరెడ్డితో పాటు శివశంకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నాగేశ్వరరావు, బండి శివశంకర్‌రెడ్డి, అబ్దుల్, కొండారెడ్డి, గోపీయాదవ్, కత్తి ప్రతాప్‌రెడ్డి, కొండారెడ్డి, బ్రహ్మం, మల్లికార్జునరెడ్డి, దానం, బాలు, చాంద్‌బాష, షరీఫ్, సంజీవరెడ్డి, రామమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, బయ్యపురెడ్డి, హిమాంసాహెబ్, శ్రీనివాసులు రెడ్డి, బియ్యం బాష, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-రాయచోటి: దేశానికే ఆదర్శంగా జగనన్న ఆరోగ్య సురక్ష నిలుస్తోందని వైఎస్ఆర్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి మున్సిపాలిటీలోని బండ్లపెంట దర్గా పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం సందర్శనలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష తో కలసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. శిబిరం నందు ఓపి నమోదు కేంద్రం, రోగులను వైద్యులు పరీక్షించు కేంద్రాలు, రక్త పరీక్షలు నిర్వహించు కేంద్రం, మందులు పంపిణీ కేంద్రాలను శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆయన ఆరా తీశారు.రోగులతో శ్రీకాంత్ రెడ్డి మమేకమయ్యారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి సారిగా, రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్య వివరాలను నమోదు చేసి, అవసరమైన వారందరికీ వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమన్నారు రాష్ట్రంలో సుమారు కోటి, 63 లక్షల కుటుంబాల్లోని దాదాపు ఐదు కోట్ల మందికి చెందిన ఆరోగ్య డేటాను సేకరించడం జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఏడు రకాల ఆరోగ్య, వైద్య పరీక్షలను నిర్వహించి, మందులను ఉచితంగా అందజేసి, ఇంకా మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి ఆకాంక్ష, ఆశయాలను నెరవేర్చేందుకు అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేయాలి...: ముఖ్యమంత్రి జగన్ ఆకాంక్ష, ఆశయాలను నెరవేర్చేందుకు అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేయాలని శ్రీకాంత్ రెడ్డి సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు వచ్చిన రోగులను వాలంటీర్లు ,వైద్య సిబ్బంది చేయిపట్టుకును,దగ్గరుండి అవసరమైన రక్త పరీక్షలను చేయించి,వైద్యం అందేలా చేసి రోగులు సంతృప్తి చెందేలా చూడాలన్నారు. తూతూ మంత్రంగా శిబిరాలు నిర్వహిస్తే సహించమని ఆయన హెచ్చరించారు. ప్రతి రోగికి నిదానంగా వైద్య పరీక్షలు, వైద్యం అందేలా చూడాలన్నారు. ప్రతి శిబిరాన్ని స్పెషల్ ఆఫీసర్ పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గిరీష ను శ్రీకాంత్ రెడ్డి ఫోన్ ద్వారా కోరారు. ఆరోగ్యశ్రీ పరిధిలో రాకుండా ,అత్యధిక ఖర్చుతో కూడుకున్న జబ్బులున్న వారి వివరాలు తెలిపితే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి వారికి వైద్యం అందే బాధ్యత తనదేనన్నారు.

శిబిరాలలో ప్రజాప్రతినిధులు భాగస్వామ్యులు కావాలి...: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితర ప్రజాప్రతినిధులందరూ భాగస్వాములు కావాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు.రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. రోగులకు భోజనవసతి సౌకర్యాలును స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డి ఎం అండ్ హెచ్ ఓ కొండయ్య, మున్సిపల్ కమీషనర్ గంగా ప్రసాద్,సీనియర్ నాయకులు జమాల్ ఖాన్, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మదనపల్లె పరిశీలకులు హాబీబుల్లా ఖాన్, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్ ఖాన్, కౌన్సిలర్లు పద్మావతి, ఆసిఫ్ అలీఖాన్,సుగవాసి ఈశ్వర్ ప్రసాద్,ఫయాజ్ అహమ్మద్, సుగవాసి శ్యామ్, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు,ఇర్షాద్,కో ఆప్షన్ సభ్యులు అయ్యవారు రెడ్డి, హజరత్ ఖాదర్ వలీ, ముదిరాజ్ యువసేన జిల్లా కార్యదర్శి విక్కీ దేవేంద్ర, జావీద్,అమీర్, వైద్యాధికారులు డా మహేశ్వర రాజు,డా ప్రసాద్, ఎం పి హెచ్ ఈ ఓ ప్రసాద్ బాబు యాదవ్, మున్సిపల్ ఆర్ ఐ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు

జగనన్న ఆరోగ్య సురక్ష పేదప్రజల పాలిట రక్షణకవచం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పేదప్రజల ఆరోగ్యం పాలిట రక్షణకవచమని వైయస్సార్ సిపి నాయకులు ప్రముఖ డాక్టర్ కె.సత్యనారాయణరెడ్డి కార్యక్రమ ప్రారంభోత్సవం సభలో మాట్లాడుతూ పై విధంగా పేర్కొన్నారు.జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రతి ఒక్కరికీ బిపి, షుగర్, రక్తహీనత గుర్తింపు కోసం హెచ్.బి మూడు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి ఇసిజి, యూరిన్, కంటి పరీక్షలు, గళ్ళ పరీక్షలు, మలేరియా , డెంగ్యూ తదితర పరీక్షలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమం సమావేశ సభకు శిబ్యాల గ్రామ సర్పంచ్ బి.నాగమణి ఆధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రత్యేక అధికారి పి.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ 104 కాల్ సెంటర్ ద్వారా, వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్ ద్వారా, ప్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ఆరోగ్య సేవలు పొందాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమ నిర్వహణ భాద్యులు మండల అభివృద్ధి అధికారి ఎ.మల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ వాలింటైర్లు ద్వారా ప్రతి ఒక్కరి మొబైల్ ఫోన్ నందు వైయస్సార్ ఆరోగ్యశ్రీ యాప్ డౌన్ లోడ్ చేసారని, ఇంకా డౌన్ లోడ్ చేసుకోవాల్సిన వారు మిగిలి ఉంటే తప్పకుండా యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.యండపల్లె ప్రాథమిక కేంద్రం వైద్య అధికారిణి డాక్టర్.డి.శారద మాట్లాడుతూ డాక్టర్ వైయస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం పొంది డిశ్చార్జ్ అయిన తరువాత విశ్రాంతి సమయంలో జీవనోపాధి కోల్పోయే పరిస్థితి కలగకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి డిసెంబర్ 1,2019 నుంచి ఆరోగ్య ఆసరా పథకాన్ని ప్రారంభించారని తెలిపారు.ఈ పథకంలో 1519 రకాల చికిత్సలకు వైద్యుల సలహా మేరకు విశ్రాంతి తీసుకోనే సమయంలో రోజుకి రూ 225 చొప్పున నెలకు గరిష్టంగా 5000 రూపాయల వరకు ఆర్థిక సహాయం అందించబడుతుందని, సూచించిన మొత్తం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యేలోపే నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో జమ చేయబడుతుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా యండపల్లె ప్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం రోజున శిబ్యాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డాక్టర్ కె.సత్యనారాయణరెడ్డి , గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రావంతి, డాక్టర్ డి.శారద, డాక్టర్ దివ్యవాణిలు 472 మందికి వైద్య పరీక్షలు చేసి 56 మందిని రెఫరల్ హాస్పిటల్ కి రెఫర్ చేసారు.అలాగే అప్తమాలిక్ ఆఫీసర్ పి.కల్పన 95 మందికి కంటి పరీక్షలు చేసి 17 మందికి కాంటాక్ట్ కోసం సిఫార్సు చేసారు. ఈకార్యక్రమంలో డాక్టర్ కె . సత్యనారాయణరెడ్డి చేతుల మీదుగా కంటి అద్దాలు పంపిణీ చేపించారు. ఈకార్యక్రమంలో శిబ్యాల సర్పంచ్ బి.నాగమణి చేతుల మీదుగా మందులు మాత్రలతో కూడిన బ్యాగులను అందజేసారు. ఈ శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పిండివంటలతో పోషకాహారం ఎక్సిబిషన్ కౌంటర్ నిర్వహించారు.

మిట్స్‌లో కొత్త టెక్నాలజీ సైన్స్ అవగాహన

విశాలాంధ్ర - మదనపల్లి: మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ వారు చెన్నై లోని ఆల్టసేన్స్ టెక్నాలజీ సర్వీసెస్ తో అనుబంధ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. ఆ కంపెనీ ఫౌండర్ అండ్ సీఈఓ షేక్ ఫ్రీత్ మరియు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ లు అనుబంధ ఒప్పందాల ధ్రువీకరణ పత్రాల పై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా కంప్యూటర్ సైన్స్ రంగం లో గల నూతన టెక్నాలజీ అయిన బ్లాక్ చైన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, ఐఓటీ మొదలైన వాటిపై శిక్షణ లు మరియు హాండ్స్ ఆన్ ట్రైనింగ్ లు నిర్వహిస్తారని, అందులో చిన్న చిన్న ప్రాజెక్ట్స్ తో విద్యార్థులకు ఈ నూతన టెక్నాలజీస్ పై అవగాహనా పెంచేందుకు ఈ అనుబంధ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన అన్నారు. ప్రస్తుతం ఐటీ పరిశ్రమల లో ఈ నూతన టెక్నాలజీస్ పై పరిశోధనలు జరుగుతున్నాయని, విద్యార్థుల కు ఇంటర్వ్యూ లలో మరియు పరిశ్రమలలో జరుగుతున్న టెక్నాలజీ డెవలప్మెంట్ పై అవగాహన పెంచేందుకు ఇది ఒక మంచి అవకాశం అని సీఈఓ షేక్ ఫ్రీత్ అన్నారు. ఈ టెక్నాలజీస్ లో ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగుగా ఉన్నాయని ఆయన అన్నారు. సాఫ్ట్వేర్ మరియు హార్డ్ వేర్ రంగాలలో జరుగుతున్న మార్పులను విద్యార్థులు సకాలంలో తెలుసు కొని వాటిని నేర్చుకోవాలని ఆయన అన్నారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్ ల ద్వార వారు చదువుతున్నపుడే పరిశ్రమంలో పనిచేసే అవకాశం ఉందని, బి.టెక్ రెండవ సంవత్సరము నుంచి ఈ ఇంటర్న్‌షిప్ లలో పాల్గొనాలని ఆయన అన్నారు. తమ కంపెనీ లో కూడా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ లు ఆఫర్ చేస్తామని సకాలంలో వాటిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్) విభాగాధిపతి డాక్టర్ కుసుమ, కో ఆర్డినేటర్ ఏ. కళ్యాణ్ కుమార్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం లో విద్యార్థులకు హాండ్స్ ఆన్ ట్రేనింగ్ ద్వారా ప్రాజెక్ట్ లు తయారుచేపించడం జరిగింది.

సత్రం అభివృద్ధికి కృషి చేద్దాం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల కేంద్రం లోని మహాయోగి వేమారెడ్డి అన్నదాన సత్రంలో అభి వృద్ధికి కృషి చేయాలని, కులమ తాలకు అతీతంగా మంచి రుచికరమైన భోజ నాలు అందించాలని రాష్ట్రం నలుమూలల నుండి వచ్చే భక్తులకు కల్పించే విధంగా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అందరు కృషి చేయాలని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్ర పరిధిలోని స్థానిక యోగి వేమారెడ్డి అన్నదాన సత్రంలో నూతన కమిటి అధ్యక్షుల ఎంపికతో పాటు ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని చేపట్టా రు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో పాలు, రాష్ట్ర రైతు సలహామండలి చైర్మెన్ ఇరగంరెడ్డి తరుపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు రామగోవిందరెడ్డి, మండల అధ్యక్షులు వీరనారాయణరెడ్డి, సోమిరెడ్డిపల్లె సహకార పరపతి సంఘం చైర్మెన్ నేలటూరు సుబ్బారెడ్డి, నూతన అధ్యక్షులు పెద్దిరెద్ది గంగిరెడ్డి, ఉపాధ్యక్షులు కోటిరెడ్డి, నరసరావుపేట గౌరవ అధ్యక్షులు పెద్దిరెడ్డి చిన్న ఓబుల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిలు, కోశాధికారులుతో పాటు కొంతమంది కమిటి సభ్యులతో ప్రమాణస్వీకారం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ సత్రం అభివృద్ధికి కృషి చేస్తానని, రాబోయే రోజుల్లో సత్రాన్ని అభివృద్ధికి కృషి చేస్తూ రాబోయే రోజుల్లో సత్రాన్ని మరింత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పించే విశయంలో తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, తిరుపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఆలయం నందు మహాయోగి వేమారెడ్డి అన్నదాన సత్రం కమిటీని నియమించడంతో సత్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. పాలకమండలి సభ్యులు అందరు సమిష్టి కృషితో భక్తులకు భోజనాలు అందించాల న్నారు. దాతలు ఎవరైన ముందుకు వచ్చి రూముల అభివృద్ధికి కృషి చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాల రెడ్డి సంఘంకమిటి సభ్యులు, పెద్దిరెడ్డి రఘునాథరెడ్డి, పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, పెండ్లిమర్రి మండల అధ్యక్షురాలు మార్తల వరలక్ష్మి, కమిటీ సభ్యులు పెద్దిరెడ్డి చిన్న ఓబులరెడ్డి, సర్పంచులు బసిరెడ్డి చెన్నకృష్ణారెడ్డి, అనంతరెడ్డి, మన్యంశంకర్‌రెడ్డి, వైకాపా నాయకులు పాలరామిరెడ్డి, భాస్కర్, సుబ్బారెడ్డి, రాజానాయుడు, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వం లక్ష్యం

విశాలాంధ్ర-గాలివీడు: ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ పద్మావతమ్మ అన్నారు. మంగళవారం సీసీ పల్లెలో గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే గొప్ప ఆశయంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ను సీఎం వైయస్ జగన్ తీసుకువచ్చా రన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ప్రజల ఆరోగ్య సముస్యలను తెలుసు కోవడంతోపాటు వాటిని పరిష్కరించే గొప్ప బాధ్యతను సీఎం తీసుకున్నారన్నారు.అన్ని గ్రామ,వార్డు సచివాలయాల పరిధిలో వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఆయా గృహాలలో ఆరోగ్యసేవలు గురించి ఆరాతీసి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి వారిని మెడికల్ క్యాంపులుకు తీసుకుని వచ్చి వైద్య సేవలు అందించడం జరుగుతోం దన్నారు.వైద్య శిబిరాలలో 14 రకాల వైద్యసేవలు అందిస్తారని,105 రకాల మందులను ఉచితంగా అందిస్తారన్నారు. చికిత్సలు,శస్త్ర చికిత్సలు అసరమైనవారిని గుర్తించి వారికి ఆరోగ్యశ్రీ రిఫరల్ ఆస్పత్రుల లో వైద్యసేవలు అందిస్తారన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ శేఖర్ నాయక్,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కేసులకు బయపడం ..ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటాం:టీడిపి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : జగన్ మోసంరెడ్డి అక్రమ కేసులకు భయపడం ప్రజాక్షేత్రంలో తేల్చుకుం టాం అని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు హెచ్చరించారు.మంగళవారం సాయంత్రం టిడిపి ప్రధాన కార్యాలయం వద్ద పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఓటమి భయంతోనే వ్యవస్థలన్నిం టిని అడ్డు పెట్టుకుని చంద్రబాబు పై తప్పుడు కేసు నమోదు చేశారు ఆగ్రహం వ్యక్తం చేశారు.టిడిపి హయాం లో నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్మెంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.టిడిపి హయాంలో 6 లక్షల కోట్ల రూపాయలు జరిగిందని జగన్ సహా వైసిపి మూరు?లు అందరూ నోరుఎత్తి మొత్తుకు న్నారన్నారు.60 రూపాయలు అవినీతి నిరూపించలేక పోయారని విమర్శించారు. కేసు రిమాండ్ రిపోర్టులో కూడ పొంతన లేని సమాధా నాలు చెర్చారని విమర్శించారు.ఫైబర్ గ్రిడ్ ఏర్పాటుకు అయ్యే ఖర్చు 5 వేల కోట్ల ఖర్చు ను 330 కోట్లకు చంద్రబాబు నాయుడు తగ్గించారన్నారు.చివరకు 328 కోట్లకే టెండర్ ఖరారు చేశారన్నారు. అ టాలెంట్ చంద్రబాబు కే సాధ్యం అని కొనియాడారు. వైసిపి పాలనలో నేరస్తులు బయట తిరుగుతున్నారన్నారు. దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన వైసిపి ఎంఎల్సీ అనంతబాబు కు బెయిల్ ఇప్పించి బయట తెచ్చార న్నారు. చంద్రబాబు నాయుడుపై పెట్టిన ఆక్రమ కేసుల్లో ఒకట్టైనా నిరూపించలేక పోయారని విమర్శించారు.ఈ సమా వేశంలో ముద్దలూరు నరసింహ రాజు, కెకె చౌదరి, పులెల రమేష్ బాబు, నాగరాజు, కొమ్మా శివ, గడికోట సుబ్బరాయుడు, ముక్కర శంకరయ్య, పోగూరు శివయ్య , జయచంద్ర,నాగరాజు పాల్గొన్నారు.

స్వస్థలం చేరిన అన్నమయ్య జిల్లా వాసి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మిట్టపల్లి గ్రామం, సిద్దవటం మండలం, రాజంపేట నియోజకవర్గం వాసి శివయ్య నాయుడు గత 2 సం:ల క్రితం కుటుంబ సభ్యుల ఉజ్వల భవిష్యత్తు కొరకు కువైట్ వ్యవసాయ క్షేత్రం సేద్యం పని కొరకు ఒఫ్రా ప్రాంతములో వచ్చారు. స్పాన్సర్ (కువైటీ) జీతాలు సరిగా ఇవ్వకుండా 8 గంటలు డ్యూటీ ఉంటే 10, 12 గంటలు పని చేయించుకుంటూ ఉంటే ఒకటిన్నర సం: క్రితం అక్కడ నుండి పారిపోయి బయట బిల్డింగ్ కూలి పని చేసుకుంటూ ఉండగా గత 2 నెలల నుంచి ఆరోగ్యం సరిగా లేకుండా పోయి లైట్ గ పక్షవాతానికి గురై ఇండియా వెళ్లాలని నిర్ణయించుకొని విజ తీసిన అతనికి నాకు ఆరోగ్యం బాగా లేదు పాస్పోర్ట్ ఇప్పిస్తే ఇండియా వెళ్లి పోతాను అని ఎంత బతిమాలినా పాస్పోర్ట్ ఇవ్వకుండా పారిపోయినాడు అని కేసు పెట్టడం జరిగింది. ఈ విషయాన్ని ఈశ్వర్ నాయుడు కొడుకు శివయ్య నాయుడు ఇండియా నుంచి వైకాపా గల్ఫ్ కో కన్వీనర్ గోవిందు నాగరాజు, గల్ఫ్ ప్రతినిధి షేక్ ఫయాజ్‌కి తెలపగా వారు గల్ఫ్, కువైట్ కన్వీనర్లు ఇలియాస్ బి.హెచ్, ముమ్మడి బాలిరెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లగా వెంటనే స్పందించి ఏపీఎన్ఆర్టీఎస్ రీజనల్ కోఆర్డినేటర్ నాయని మహేశ్వర్ రెడ్డికి చెప్పి ఇండియన్ ఎంబసీ అధికారులతో మాట్లాడి స్పాన్సర్ (కువైటీ) వద్ద నుండి పాస్పోర్ట్ ఇప్పించి ఇండియా పంపించడం జరిగిందని ఇలియాస్, బాలిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా

నాపై బురద జల్లడం సరికాదు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ముస్లిం మైనారిటీ సొసైటీ ఆస్తులపై, నాపై బురదజల్లేప్రయత్నం చేయడం సరికాదని తయూబ్ పాలిటెక్నిక్ కళాశాల ప్రెసిడెంట్ షేక్ ఖాదర్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. మంగ్లవారం వైయస్సార్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తయూబ్ ముస్లిం సొసైటీ స్థలాన్ని అమ్ముకున్నారని నాపై ఆరోపణలు సరికాదు అన్నారు. కళాశాల కష్టకాలంలో అప్పులు చేసి నడిపిన కాలాని తెలుసుకొని మాట్లాడాలి అన్నారు. అవి అన్నీ తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం విడ్డూరంగా వుందని మండిపడ్డారు. వారి ఆరోపణలను తాయూబ్ ముస్లిం సొసైటీ కమిటీ సభ్యులు ఖండించారు. నేను కళాశాల ప్రెసిడెంట్ అయినప్పటి నుండి ఆడిటింగ్ రికార్డ్స్ సరిగా ఉన్నాయన్నారు. ముస్లిం మైనారిటీ పెద్దల సమక్షంలో 7 రోడ్స్ లో బహిరంగ చర్చ కు సిద్ధమని ఆయన వివరణ యిచ్చారు. తయ్యబ్ ముస్లిం పాలిటెక్నిక్ సొసైటీ కళాశాలలో మేము అడ్మిషన్ చేస్తున్నాం మేము జీతాలు ఇస్తున్నాం మేము అన్ని చేస్తున్నాం కనుక కళాశాల అభివృద్ధి కోసం స్థలం అమ్మడం జరిగిందని తెలిపారు. ఇలాంటి లేనిపోని మాటలు మాట్లాడి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేయొద్దని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కలాం, ముక్తియార్ అలి, ఇంతియాజ్ కళాశాల సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా జీఎంఏటీ పరీక్షలు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు జీఆర్ఇ, జీఎంఏటీ పరీక్షలను ఉచితంగా అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందని అధికార వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ షాహీద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేక రులతో విలేకరులతో మాట్లాడుతూ ఎంఐటీ, హార్వర్డ్ వంటి యూని వర్శిటీల ఆధ్వర్యంలో రూపొందించిన 1800 కోర్సులను ఉన్నత విద్య సిలబస్‌లోకి తెచ్చే ప్రక్రియ ప్రారంభమైందని ఆయన వివరించారు. ప్రభుత్వం ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ఎడెక్స్‌తో కలిసి సర్టిఫికెట్లు జారీ చేస్తుందన్నారు. విద్యార్థులు పోటీ ప్రపంచంలో కష్టపడి చదివి తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆయన సూచించారు.

వైసీపీ పాలనలో నాయీబ్రాహ్మణులకు పెద్దపీట

విశాలాంధ్ర-పులివెందుల: వైసీపీ పాలనలో నాయీబ్రాహ్మణులకు పెద్దపీట వేశారని ఏపీఎస్‌హెచ్ పీఎస్ అధినేత్రి భవ్య దొండ్లవాగు పేర్కొన్నారు. పులివెందుల పట్టణం లో నూతనంగా ఎన్నికైన నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్ల పుల్లయ్య మంగళవా రం భవ్యను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పులివెందులకు విచ్చేసి పుల్లయ్యను ఆమె ఘనంగా సన్మానించారు. అనంతరం భవ్య మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు కూడా నేటి సమాజంలో రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి జగన్ కృషి చేస్తున్నారన్నారు. వివిధ కార్పోరేష్ల నామినేటెడ్ పదవుల ఎంపికలో పారదర్శకత పాటించిన సీఎం జగన్ అదే తరహాలో నాయీబ్రాహ్మణులకు కూడా అధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. సమాజ హితవు కోరే నాయీబ్రాహ్మణులను సీఎం జగన్ ఆదరించడం గొప్ప విషయమన్నారు. నాయీబ్రాహ్మణ సంక్షేమానికి అండగా నిలవాలని పుల్లయ్యను ఆమె కోరారు. చైర్మన్ పుల్లయ్య మాట్లాడుతూ తనకు అప్పగించిన పదవికి న్యాయం చేస్తానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు.

నేడు నగరిగుట్టలో గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణం నగరిగుట్ట సచివాల యంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిం చనున్నట్లు వైసీపీ వర్గీయులు తెలిపారు. ఉదయం 6.30గంటలకు నైట్‌షెల్టర్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుం దన్నారు. కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, జెసిఎస్ కన్వీనర్లు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చిన్నారి అప్పగింత

విశాలాంధ్ర-వేంపల్లె: తప్పి పోయిన ఓ చిన్నారిని అంగన్‌వాడి టీచరుకు అప్పగించిన ఉదంతం వేంపల్లెలో మంగళవారం చోటు చేసుకుంది. వేంపల్లెకు చెందిన చిన్నారి తప్పి పోవడంతో కొంత మంది కలిసి ఆ చిన్నారిని స్టేషన్‌కు అప్పగించారు. అయితే చిన్నారి వివరాలకు కోసం పోలీసులు సమాచారం అందించారు. అనంతరం చిన్నారిని అంగన్‌వాడి టీచరుకు అప్పగించారు. ఆ చిన్నారిని గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించాలని పోలీసులు, అంగన్‌వాడి టీచరు కోరారు.

ఐదు లక్షల మంజూరు పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు మండలంలోని మిట్టామనుపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని పప్పాన పల్లె గ్రామానికి చెందిన ఇల్లూరు వెంకటేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా వై.యస్.ఆర్. భీమా కింద మంజూరు ఆయన 5 లక్షల రూపాయల మంజూరు పత్రాన్ని మరియు నూతన పెన్షన్ పత్రాన్ని అతని భార్య ఇల్లూరు రుతు కి అందచేసిన మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లె రఘురామిరెడ్డి తోపాటు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారుడు ఇరుగంరెడ్డి తిరుపాల్ రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసగా పూజలు

విశాలాంధ్ర-బద్వేల్ : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, వారి తనయుడు యువ నాయకుడు రితీష్‌కుమార్‌రెడ్డి సారధ్యంలో చెన్నంపల్లె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి అక్రమ అరెస్టును ఖండిస్తూ చంద్రబాబు త్వరగా బయటకు రావాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అట్లూరు మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, బద్వేల్ మండల అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, రవికుమార్, జహంగీర్‌బాష, నరసింహ నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు కేవి సుబ్బారెడ్డి, బద్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి మిత్తికాయల రమణ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాల నివారణకు గస్తీ ముమ్మరం

రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు అవగాహన
పోలీసుస్టేషన్లను సందర్శించిన ఎస్పీ-రికార్డుల నిర్వహణపై సంతృప్తి
పరిసరాల పరిశుభ్రతపై ఎస్పీ కితాబు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ మంగళవారం ఎర్రగుంట్ల, కలమల్లలోని పోలీసుస్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుస్టేషన్లను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు వాటి పరిసరాలను సైతం గమనించారు. ఎర్రగుంట్ల పోలీసులు ఎస్పీ రాకను దృష్టిలో ఉంచుకొని స్వాగత ఏర్పాట్లు ఘనంగా చేశారు. అందులో భాగంగా పచ్చటి తివాచీ పరిచారు. ఆయా స్టేషన్లలో ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్లలోని రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య, ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, కృష్ణంరాజు నాయక్, కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డిల కు ఆయన కితాబిచ్చా రు. రికార్డులను సక్రమంగా నిర్వహిస్తుం డడంతో పాటు ఆయా స్టేషన్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్న నేపథ్యంలో ఎస్పీ సిద్దార్థ కౌశల్ వీరిని అభినందించారు. పోలీసు అధికారులకు ఎస్పీ పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అసాంఘీక కార్యకలాపాలను ఉపేక్షించరాదని ఆయన సూచించారు. దొంగతనాలను అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల సమన్వయంతో నాటుసారా, అక్రమ మద్యంపై దాడులు ముమ్మరం చేయాలని ఎస్పీ సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమా దాలను అరికట్టేందుకు వాహనదారులు, ప్రజలలో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. దిశ రిసెప్షన్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. కాగా ఎస్పీ వెంట జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, కొండాపురం సీఐ వేణుగోపాల్ కూడా ఉన్నారు.

రిమ్స్‌లో ఘనంగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

విశాలాంధ్ర -కడప : కడప నగర శివారులోని గవర్న మెంట్ జనరల్ హాస్పిటల్ రిమ్స్ లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మానసిక విభాగం సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట రాముడు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.సురేఖ, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ రెడ్డి, దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోత్స్న, సి ఎస్ ఆర్ ఎమ్ ఓ డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం, ప్రతి సంవత్సరం అక్టోబరు 10న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించ బడుతోంది. మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగించేందుకు ఈ దినోత్సవం జరుపుకుంటారు. 150కిపైగా దేశాలకు చెందిన సభ్యులున్న ప్రపంచ మానసిక ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో దీనిని మొదటిసారిగా 1992లో జరుపుకున్నారు. మానసిక అనారోగ్యం ప్రపంచవ్యాప్తం గా ప్రజల జీవితాలపై చూపించే ప్రభావాలను దృష్టికి తీసుకురావడానికి వేలాదిమంది స్వచ్ఛంద కార్యకర్తలు ఈ వార్షిక అవగాహన కార్యక్రమాన్ని జరుపుకుంటారు. మానసిక ఆరోగ్యం అనేది సార్వత్రిక మానవ హక్కు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి, మెడికల్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాఘవేంద్ర రెడ్డి, మానసిక విభాగం డాక్టర్లు, టెక్నీషియన్లు, నర్సింగ్ సిబ్బంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందనలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యా య అవార్డు అందుకున్న ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులను ఎస్టీయు మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినట్లు ఎస్టీయు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.శేఖర్ బాబు తెలిపారు. మంగళవారం కలసపాడులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలనందు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.జె.కవిత, అదే పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న వి.నలోమి సత్యవతి, ఎంపిపియస్ దూలంవారిపల్లె యందు ఎస్జిటిగా పనిచేస్తున్న ఎస్.శివారెడ్డి, కాశినాయన మండలం నందు పనిచేస్తున్న వాకా చంద్రశేఖర్ లను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించడమైనది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి పి.ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ, అవార్డు అందుకున్న వీరందరూ వృత్తి ధర్మాన్ని పాటిస్తూ, వారు పని చేసే పాఠశాలల యందు నిబద్ధతతో, క్రమశిక్షణతో పని చేసి మంచి ఉపాధ్యా యులుగా పేరు తెచ్చుకున్నారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిం చడంలో వీరు చేసిన కృషికి తగిన గుర్తింపు లభించడం సంతోషదాయకమన్నారు. జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి మాట్లాడుతూ రకరకాల బోధనేతర పనులతో సతమతమవుతున్న నేటి ఉపాధ్యాయులు పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి చాలా కష్టపడుతున్నారని, అటువంటి ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించక పోవడం బాధాకరమన్నారు. నాణ్యమైన విద్యతోనే నాణ్యమైన సమాజం నిర్మితమవుతుందని, అటు వంటి నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులను బోధనేతరపనుల నుండి మినహా యించి, వారి సమస్యలను పరిష్కరించినపుడే సాధ్యపడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన, ఆర్థిక కార్యదర్శులు సత్యనారాయణ, వెంకటరెడ్డి, బాలచెన్నయ్య, జిల్లా కార్యవర్గసభ్యులు శివారెడ్డి, సత్యనారాయణ, పాండు, బాలరాజు నాయక్, రామసుబ్బయ్య, ప్రసాద్, భాస్కర్ రెడ్డి, నాగిరెడ్డి, గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ముసుగులో వైసీపీ నాయకుల డ్రామా: టీడీపీ

విశాలాంధ్ర-పులివెందుల: అభివృద్ధి ముసుగులో వైసీపీ నాయకులు నాటకాలు ఆడుతున్నారని టీడీపీ తెలుగు యువత కార్యదర్శి అక్కులుగారి విజయ్ విమర్శించారు. పులివెందుల పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల పట్టణ అభివృద్ధి కోసం సుమారు రూ.500కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. ఈ నిధులను తవ్వడం, పూడ్చడం లేదా చేసిన వాటికి మరమ్మతులు చేపట్టడంతోనే సరిపెట్టు కుంటున్నారని ఆరోపించారు. ఈ నిధులు వైఎస్ కుటుంబ సభ్యులు లేదా కొంత మంది కౌన్సిలర్లకు మాత్రమే బాగా ఉపయోగపడ్డాయన్నారు. నిజానికి పులివెందుల ఎక్కడ జరిగిందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నాలుగున్నరేళ్ల పాలనలో నిధులకు తగ్గ అభివృద్ధి నిరూపించగలరా అంటూ ఆయన వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు. అభివృద్ధి జరుగలేదంటూ తాము నిరూపిస్తామని అందుకు బహిరంగ చర్చకు సిద్ధమేనా అంటూ మరో సవల్ విసిరారు. పులివెందుల ప్రాంతంలో నిరుద్యోగ సమస్య విలయతాండవం చేస్తున్నా ముఖ్యమంత్రి పట్టించుకోలేదని తెలిపారు. వైసీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం తూతూ మంత్రంగా అభివృద్ధి జరిగిందని, దీన్ని గోరంతలు కొండంతలుగా గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఒకవేళ అభివృద్ధి జరిగి ఉంటే శ్వేతపత్రం విడుదలచేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. ఆ తర్వాత పులివెందుల ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

కడప ఆర్ట్స్ కాలేజీలో అంతరిక్ష అంశాలపై ఫోటో ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఇస్రో సంస్థ, భారతీయ శాస్త్రవేత్తలు కేంద్ర ప్రభుత్వ వెన్నుదన్నుతో ఇటీవల జయప్రదంగా నిర్వహించిన చంద్రయాన్ 3 మరెన్నో అంతరిక్ష ప్రయోగాలకు స్ఫూర్తినిస్తుందని ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాల భౌతిక శాస్త్ర విభాగం - జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో స్పేస్ అంశాలపై ఫోటో ఎగ్జిబిషన్‌ని మంగళవారం ప్రభుత్వ పురుషుల కళాశాల ఆవరణలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగారకుడిపై మానవుడు నివాసం ఏర్పరచుకునే రోజు ఎంతో దూరంలో లేదని, ఆ ప్రయోగాలలో కూడా భారతీయ శాస్త్రవేత్తలే విజయం సాధిస్తారని అన్నారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు పి.బయపురెడ్డి మాట్లాడుతూ మానవ నిర్మిత కృత్రిమ ఉపగ్రహం 66 సంవత్సరాల కిందట అక్టోబర్ లో జయప్రదమైన స్పుత్నిక్ ప్రయోగాన్ని గుర్తు చేసుకుంటూ, స్పేస్ వీక్ ను అక్టోబర్ 4 నుండి 10 వరకు ప్రపంచంలోని 70 దేశాలు నిర్వహిస్తాయని అన్నారు. జెవివి జిల్లా గౌరవ అధ్యక్షులు రఘునాథరెడ్డి, నగర కార్యదర్శి శివరాం మాట్లాడుతూ అంతరిక్ష ప్రయోగాలతో పాటు, మానవుడి రోజువారి జీవితంలో ఉండే మూఢనమ్మకాలను, అశాస్త్రీయ అంశాలను పోగొట్టేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భూషణ్ రెడ్డి, నాగేశ్వరరాజు, శ్రీనివాసులు, ఆదినారాయణ, సుధాకర్ రావు, జమాల్ బాషా, సుధాకర్ రెడ్డి, విద్యార్థి ప్రతినిధి మోహన్ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : సమాజంలో నానాటికీ అంతరించిపోతున్న మానవీయ విలువల నేపథ్యంలో నిరాశ్రయులను ఆదుకోవాల్సిన కర్తవ్యం ప్రతి ఒక్కరికీ ఉందని ఎర్రగుంట్ల నిరాశ్రయుల ఆశ్రమ నిర్వాహకురాలు ఎలిజబెత్ పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ నిరాశ్ర యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆశ్రమంలోని నిరాశ్రయులతో ఆమె ర్యాలీ నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని నిరాశ్రయులకు ఇక్కడ ఆశ్రయం కల్పిస్తున్నామని గుర్తుచేశారు. అభాగ్యులను ఆశ్రమం ద్వారా అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆమె పునరుద్ఘాటించారు.

ఎన్ఇపి అమలుతో ప్రభుత్వ విద్యారంగానికి తీవ్ర నష్టం: ఎస్టీయు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) అమలు కారణంగా ప్రభుత్వ విద్యారంగం ప్రమాదపుటంచుల్లో ఉందని ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు పి.రమణా రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పోరుమామిళ్లలోని ఎస్టీయు భవన్ నందు ఎన్ఇపి అమలుపై పోరుమామిళ్ల మండలశాఖ అధ్యక్షుడు ఎ.జయరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న రమణారెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు పేద బడుగు బలహీన మధ్యతరగతి వర్గాలకు చెందిన పిల్లలకు ఒకటి నుండి ఐదు తరగతుల వరకు ప్రాథమిక విద్య అందుబాటులో ఉండాలని ప్రతి ఆవాసప్రాం తంలో ఒక కిలోమీటరుకు ఒక ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కానీ దేశంలో ఎక్కడా అమలు చేయనట్టి జాతీయవిద్యావిధానం అమలు పేరుతో మన ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల విలీనప్రక్రియ కారణంగా దూరంగా ఉన్న ఉన్నత పాఠశాలలకు పిల్లలు వెళ్లలేక ప్రైవేట్ స్కూళ్ల బాట పట్టడం జరిగిందన్నారు. లక్షలకు లక్షలు వెచ్చించి,నాడు నేడుతో సకల సౌకర్యాలు సమకూరిన పాఠశాలలు నేడు పిల్లలు లేక వెలవెల బోతున్నాయన్నారు.ముందు చూపు లేకుండా చేసిన కారణంగా కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కావడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు విద్యను ప్రజలకు దగ్గర చేయాలే తప్ప దూరం చేయడం ఏంటో అర్థం కావడం లేదన్నారు. విలీన ప్రక్రియ కారణంగా రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య తొమ్మిది వేలకు పైగా పెరిగాయన్నారు. ఒక ఉపాధ్యాయుడు బోధనేతర కార్యక్ర మాలైన రకరకాల పనులు చేస్తూ,రెండు లేదా ఐదు తరగతులకు అన్ని సబ్జక్టులలో నాణ్యమైన విద్యను ఎలా అందిస్తాడో ఆలోచించకపోవడం దుర్మార్గమన్నారు. మూడు, నాలుగు, ఐదు తరగతుల పిల్లలు ఉంటే, వారితో పాటు ఒకటి,రెండు తరగతుల పిల్లలు బడికీ వచ్చేవారని, ఇపుడు మూడు, నాలుగు, ఐదు తరగతులను ఊర్లోని ప్రాథమిక పాఠశాలల యందు రద్దు చేయడంతో, చిన్న పిల్లలు రాలేక ఇంటి ముందుకు వచ్చే ప్రైవేట్ స్కూళ్ల వ్యాన్లు ఎక్కి పోతున్నారన్నారు.కేవలం ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించాలనే ఒక దురుద్దేశ్యంతోనే ఈ ప్రక్రియను చేపట్టినట్లు అనుమానం కలుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్వహించే రంగాల లో విద్య, వైద్యం చాలా ప్రాధాన్యత కలిగిన రంగాలని, అటువంటి ముఖ్యమైన రంగాలలో కార్పోరేట్ శక్తులకు, ప్రైవేటీకరణకు అవకాశం ఇవ్వడం ప్రజల ఆర్థికాభివృద్ధికి గొడ్డలి పెట్టులాంటిదని విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతమైన పుడు మాత్రమే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఇప్పటికైనా మించిపోలేదని, ప్రభుత్వం పాఠశాలల విలీన ప్రక్రియను ఉపసంహరించుకునేలా జి.వో నెంబరు 117ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థికకమిటీ సభ్యుడు బాలరాజు, రాష్ట్రకౌన్సిలర్ చంద్రహాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, కుళ్లాయప్ప, నారా యణరెడ్డి, రీజనల్ కన్వీనర్ పుల్లయ్య,క్రిష్టారెడ్డి, గురయ్య, రఘు రామిరెడ్డి, వెంకటరెడ్డి, మండల ప్రధాన, ఆర్థికకార్యదర్శులు శ్రీనివాసులు, అబ్దుల్ ఉసేన్ పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోపు పూర్తిచేయండి: కలెక్టరు

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణం లో నిర్మాణదశలో ఉన్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టరు విజయరామరాజు అధికారులకు సూచించారు. పులివెందుల పట్టణంలో మంగళవారం ఆయన పలు ప్రాంతాలను పరిశీలించారు. వాటి పురోభివృద్ధి గురించి ఆయన తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో వివిధశాఖల అధికారులతో ఆయన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో చాలా వరకు అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయని, వాటి పూర్తిచేసే ప్రక్రియపై శ్రద్ధ చూపాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యమ్రంలో ఆర్డీవో వెంకటేసులు, మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి తితరులు పాల్గొన్నారు.

ఆదెన వెంకటసుబ్బారెడ్డి సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, తెలుగుదేశం పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కీ.శే.ఆదెన వెంకట సుబ్బారెడ్డి సేవలు మరువలేనివని ఆయన లేకపోయినా ఆయనను స్మరించుకోవడం శుభపరిణామమని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం కీ.శే.ఆదెన సుబ్బారెడ్డి మూడవ వర్ధంతి సందర్భంగా అతని చిరకాల మిత్రుడైన తెలుగుదేశం పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి మీనుగ వెంకటరమణ ఆధ్వర్యంలో ఒంటిమిట్ట మండలంలోని కొత్తమాధవరం వద్ద వున్న శ్రీ కాశినాయన వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కీ.శే.ఆదెన వెంకట సుబ్బారెడ్డి పార్టీకి పదిహేను సంవత్సరాలు ఎనలేని సేవలు అందించారని టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఒకేలా అధికారం లేనప్పుడు కూడా అలాగే ఉంటూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా టీడీపీ వెన్నంటే ఉండి నిజమైన టీడీపీ కార్యకర్త అనిపించుకున్నారని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద ఎన్నో ప్రశంసాపత్రాలు అందుకున్నారని ఇలాంటి వ్యక్తి మనమధ్య లేకపోవడం బాధాకరమ న్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ నాయకుడు చింతగింజల సుబ్రమణ్యం, టీడీపీ సీనియర్ నాయకుడు ఉన్నం కిరణ్‌స్వామి, బొబ్బిలిరాయుడు, లాయర్‌రామదాసు, మామిళ్ల ఈశ్వరయ్య, ఒంటిమిట్ట బీసీ సెల్ నాయకుడు తమ్మిశెట్టి అయ్యవారయ్య, దళిత నాయకుడు పుల్లయ్య, కత్తి అయ్యవారయ్య పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు క్రికెట్ కిట్ల పంపిణీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరానికి చెందిన ప్రభుత్వ పురుషుల కళాశాల విద్యార్థులకు ఇటీవల కళాశాలలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి క్రికెట్ కిట్లను అందజేశారు. ఇటీవల కళాశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ హజరతయ్య ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆనాటి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి క్రికెట్ కిట్లను బహుమతిగా అందజేస్తానని హామీ ఇచ్చారు. హామీ మేరకు మంగళవారం కడప నగరంలోని తన కార్యాలయంలో ఆయన సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు, లయన్స్ మాజీ అధ్యక్షులు డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, ఆల్ఫోన్స్, బాబు సమక్షంలో క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఇతర క్రీడల్లో ఆసక్తికర విద్యార్థులకు వాలీబాల్, షటిల్ కిట్లను కూడా అందజేశారు. మంచి ప్రదర్శన ఇచ్చి పేరు తెచ్చుకుంటే అవసరాన్ని బట్టి మరిన్ని వ్యాయామ పరికరాలను ఉచితంగా అందజేయగలమని ఈ సందర్భంగా పోతుల వెంకట్రామి రెడ్డి వారికి సూచించారు. వారు ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ, వైకాపాలు రాష్ట్రానికి శనిగ్రహాలు: తులసిరెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వం రాష్ట్రానికి పట్టిన శనిగ్రహాలు అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మెన్ నర్రెడ్డి తులసిరెడ్డి విమర్శించారు. మంగళవారం ప్రొద్దుటూరులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ దేశాన్ని అప్పులపాలు చేస్తున్నదని మండిపడ్డారు. ఈ దేశాన్ని 1947నుండి 2014వరకు పాలించిన పాలకులు రూ.46లక్షల కోట్లు అప్పు చేస్తే, నరేంద్రమోడి 9సంవ త్సరాల పాలనలోనే రూ.115లక్షల కోట్లు అప్పులు చేశారని గుర్తుచేశారు. ఇండియా ఈస్ ఫర్ సేల్ అంటూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పాలు చేస్తున్నారని విమర్శించారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి పేద, మధ్య తరగతి ప్రజల జీవన విధానంపై దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. మణిపూర్‌లో లా అండ్ ఆర్డర్ అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందారన్నారు. కృష్ణా జలాలు ఆంధ్రప్రదేశ్‌కి రావాల్సిన నికరజలాలు తీసుకురావడంలో వైకాపా ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. దీని మూలంగా 56లక్షల ఎకరాలు బీడు భూములుగా ఏర్పడే ప్రమాదం ఉన్నదని, పరిశ్రమలకు నీళ్లు లేక మూతపడే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజ నాలను పరిరక్షించలేని ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పీఎండీ నజీర్, పట్టణ అధ్యక్షులు జీలానిబాష, ఎస్.రామాంజనేయులు, షేక్ మమ్మద్, చంద్రమౌళి, లీలారాణి, నరసింహారెడ్డి, అమీర్, ఉత్తన్న పాల్గొన్నారు.

పెయిన్ రిలీఫ్ ఆయిల్ బాటిల్స్ పంపిణీ

విశాలాంధ్ర-బద్వేల్ : ఆరోగ్య భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బద్వేల్ పట్టణంలోని తెలుగు గంగ కాలనీలో ఉన్న ఆనంద నిలయం నిరాశ్రయుల వసతి గృహంలోని వృద్ధులకు మోకాళ్ళ నొప్పులు,కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం లభించే పెయిన్ రిలీఫ్ ఆయిల్ బాటిల్స్ బద్వేల్ పట్టణానికి చెందిన పిడుగు వెంకట సుబ్బారెడ్డి సహకారంతో పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆరోగ్య భారత్ ఫౌండేషన్ అధ్యక్షులు రహీం మాట్లాడుతూ ఆరోగ్య భారత్ ఫౌండేషన్ సంస్థను స్థాపించిన కొద్దికాలంలోనే అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, రాబోయే రోజుల్లో ఇంకా అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పక్కీరయ్య, విశ్వనాథ్ రెడ్డి, రాజారెడ్డి, సిద్దారెడ్డి, ఆనంద నిలయం నిర్వాహకులు పి. రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అన్నమయ్య జిల్లా

క్రీడాకారులను ప్రోత్సహించడానికే ఆడుదాం ఆంధ్ర లక్ష్యం: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: గ్రామా స్థాయి క్రీడల నుంచి క్రీడాకారులను ప్రోత్సహించడమే ఆడుదాం ఆంధ్ర లక్ష్యమని జిల్లా కలెక్టర్ గిరీష పి.ఎస్, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డిలు అభిప్రాయ పడ్డారు. మంగళవారం రాయచోటి జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్లో జిల్లా కలెక్టర్ గిరీష పి.ఎస్, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ లు ఆడుదాం ఆంధ్ర క్రీడా పరికరాలను పరిశీలించారు. లితః సందర్భంగా కలెక్టర్, ఎంఎల్ఏలు మాట్లాడుతూ... ప్రతి సచివాలయాలనికి రెండేసి చొప్పున ఆడుదాం ఆంధ్ర కిట్లు వస్తాయని చెప్పారు. ఈ పోటీలలో పాల్గొని గెలుపొందిన వారిలో ఒక కిట్ మహిళలు, ఒక కిట్ పురుషులకు అందచేయడం జరుగుతుం దన్నారు. అన్నమయ్య జిల్లాలోని సచివాలయాలకు 501 కిట్లను అందిస్తామన్నారు. ఈ కిట్లలో వాలీబాల్ నెట్, షటిల్ నెట్, క్రికెట్ కిట్ తదితరాలుంటాయని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు డిసెంబర్ 11 నుంచి జనవరి 15 వరకు ఈ ఆడుదాం ఆంధ్ర ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందన్నారు. రాయచోటి పట్టణంలో క్రికెట్ స్టేడియం నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.. త్వరలో స్టేడియం అందుబాటులోకి వస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాశాఖ అధికారి చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలో సీఎం జగన్‌కు ఓటమి తప్పదు : టీడీపీ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అహంకారి ముఖ్యమంత్రికి ప్రజా క్షేత్రంలో ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారని రమేష్ రెడ్డి తీవ్రంగా దుయ్యబట్టారు. మంగళవారం నాడు పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. ఓటమి భయం తోనే జగన్ వ్యవస్థల్ని అడ్డుపెట్టుకొని చంద్రబాబు నాయుడు గారిపై అక్రమ కేసులతో రాజకీయ కక్ష సాధిస్తున్నారన్నారు టిడిపి హయాంలో ఆరు లక్షల కోట్ల అవినీతి జరిగిందంటూ సీఎం జగన్ తో సహా వైసిపి నేతలు అంతా నోరు నెత్తి బాదుకున్నారు కానీ అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు అయినా 60 రూపాయల అవినీతిని కూడా నిరూపించుకోలేకపోయారని తెలిపారు. వైసీపీ పాలనలో నేరస్తులు బయట తిరుగుతున్నారు నిరపరాదులు చెరసాలలో ఉంటున్నారు అరాచక పాలనకు కాలం చెల్లిందని తీవ్రంగా దుయ్యబట్టారు .ఎన్ని కేసులు పెట్టిన భయపడేది లేదు ప్రజా క్షేత్రం లో తెల్చుకుంటాం ఈ కేసు రిమాండ్ రిపోర్ట్ లో పేజీ నంబర్ 16 లో ఒక పేరాలో రూ 145.37 కోట్లని మరో పేరాలో రూ 279 కోట్ల రూపాయల ని పేజీ నంబర్ 21 లో అస్సలు ఈ సొమ్మంతా ఎవరి ఖాతాల్లోకి వెళ్లిందో తెలియదని సీఐడీ చెప్పిందన్నారు డబ్బు ఎంతో తెలియకుండా ,ఎవరి ఖాతాల్లోకి వెళ్లిందో తేలకుండా చంద్రబాబే తప్పు చేశారని ఎలా అంటారని సూటిగా ప్రశ్నించారు.సైబర్ పై ఖర్చు 2800 కోట్లు ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం 900 కోట్లు ఇ ది నిజం ,అవినీతి అపద్దం. రాష్ట్ర ప్రజలకు నెలకు కేవలం 149 రూపాయలకు ఇంటికి ఇంటర్నెట్ ఫోన్ టీవీ ఛానళ్ల సౌకర్యం కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడు గారిదే అన్నారు. నిజం ఎప్పటికీ దాగదు చంద్రబాబు నాయుడు గారు ఏ తప్పు చేయలేదు చివరకు న్యాయం గెలుస్తుంది జగన్మోహన్ రెడ్డి ఎన్ని డ్రామాలాడినా ప్రజా క్షేత్రంలో అభాసుపాలు కాక తప్పదని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు చంద్రబాబు నాయుడు గారిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని రాయచోటి నందు 30 రోజులు రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగింది నిరహార దీక్షలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మేధావులు మహిళలు మైనార్టీలు అన్ని కులాల వారు వచ్చి నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపారు చంద్రబాబు నాయుడు గారు నిర్దోషిగా బయటకు రావాలని ఈరోజు చర్చి నందు గుడి మరియు దర్గా నందు పెద్ద ఎత్తున ప్రార్థనలు చేయడం జరిగింది. రేపటినుండి ప్రతి గ్రామంలో కూడా చంద్రబాబు నాయుడు గారిని అన్యాయంగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉంచారన్న విషయంపై నిరసన చేపడతామని తెలిపారు నిలకడగా న్యాయస్థానంలో న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా ,పట్టణ అధ్యక్షులు ఖాదర్ వలీ ,సర్పంచ్ వాసు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వాలంటీరుకి గాయాలు

విశాలాంధ్ర -రామసముద్రం: రోడ్డు ప్రమాదంలో వాలంటీరుకి గాయాలైన సంఘటన మంగళవారం రామసముద్రం మండలంలో జరిగింది మండలంలోని మాలేనత్తం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష జరిగింది. ఈ ఆరోగ్య సురక్షకు మూగ ఎర్ర పల్లి గ్రామానికి చెందిన వాలంటీర్ శ్రీనాథ్ అదే గ్రామానికి చెందిన పార్వతమును ద్విచక్ర వాహనంలో సురక్షకు తీసుకొస్తుండగా మాలేనత్తం గ్రామంలో ట్రాక్టర్ ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనాథ్ కు గాయాలయ్యాయి వెంటనే బాధితుని సచివాలయంలోకి తీసుకొచ్చి వైద్యాధికారిని లీల ప్రథమ చికిత్స చేశారు. అనంతరం 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని డాక్టర్లు తెలిపారు.

నేడు హసనాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - రామాపురం : మండలంలోని హసనాపురం పంచాయతీ లో బుధవారం గురువారం చింతలవాండ్లపల్లి నుండి గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో హైదరవల్లి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ప్రజాప్రతి నిధులు అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని హాజరుకావాలని ఆయన తెలిపారు బుధవారం ఉదయం 6 గంటల నుండి చింతల చింతల వాండ్లపల్లి నుండి ప్రారంభమ వుతాదని ఆయన అన్నారు.

పోస్ట్ ఆఫీస్ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - రామపురం : గ్రామాలలో ప్రజలు ప్రతి ఒక్కరు పోస్ట్ ఆఫీస్ ద్వారా కేంద్ర ప్రభుత్వం పోస్ట్ ఆఫీసుల ద్వారా ప్రవేశపెట్టేపథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సౌత్ సబ్ డివిజన్ అధికారి ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు అన్నారు. స్థానిక పోస్ట్ ఆఫీస్ నుంచిఎమ్మార్వో ఆఫీస్ వరకు పోస్టల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్తుకు సుకన్య సమర యోచన పథకమా.ఎస్ ఎస్ ఏ. పథకాలను చదివినయోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది డెవలప్ అధికారి రామాపురం సబ్ పోస్ట్ మాస్టర్ పాల్గొన్నారు.

కోటపల్లి సనోంద్ర రెడ్డిచే కంప్యూటర్ల వితరణ

విశాలాంధ్ర-పీలేరు: వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామ పంచాయతీ మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థుల కోసం శ్రీ కోటపల్లి సనోంద్ర రెడ్డి 4 కంప్యూటర్లు వారి కుమారుడైన కోటపల్లి దేదీప్ రెడ్డి చేతుల మీదుగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు బహూకరించడం జరిగింది. గత ఏడాది కోటపల్లి సనోంద్ర రెడ్డి చేతులమీదుగా ఇదివరకే లైబ్రరీ బుక్స్, స్పోర్ట్స్ కిట్స్, పిల్లల ఐడింటిటీ కార్డ్స్ ఇవ్వడం జరిగింది. ఇలాగే ప్రతీ ఏడాది పిల్లలకు ఉపయోగపడే వస్తువులు ఇస్తామని తెలియ జేసారు. కంప్యూటర్ల బహూకరణ కు గాను పిల్లలు, ఉపాధ్యా య బృందం కోటపల్లి సనోంద్ర రెడ్డి ఫ్యామిలీ కి తమ కృతజ్ఞ తలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో ప్రధాన ఉపాధ్యా యులు కే. నాగరాజు, ఉపాధ్యాయులు డి. వనజ, ఎస్. అను రాధ, ఎస్. యల్లప్ప, వి. శశికళ, వి. సుమలత, ఎఫ్. చంద్ర శేఖర్ రెడ్డి, మిత్రులు యోగానంద రెడ్డి, మురళి పాల్గొన్నారు.

అభివృద్ధికి అమాడ దూరంలో ఆంధ్రప్రదేశ్

విశాలాంధ్ర-పీలేరు:- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని లేకుండా చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కుతుందని ఏపీ సి సి మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా విమర్శించారు, పీలేరులో మీడియాతో ఆయన మాట్లా డుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుంది అన్నారు, ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా సాధించడంలో పూర్తిగా విఫలమైన ప్రాంతీయ పార్టీలురాష్ట్రంలో యువతకు నిలువ నీడ కోల్పోయిన నిరుద్యో గులు ఉద్యోగం కోసం పక్క రాష్ట్రాలకు వలస పోతున్నార న్నారు రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పేద ప్రజలకు నిరుద్యోగు లకు ఎటువంటి ఉపాధి లేకుండా చేసిన ఘనత వైసిపి ప్రభుత్వ నీదే అన్నారు వైసిపి ప్రభుత్వం నాలుగున్నర సంవత్స ర కాలంలో ప్రజలకు ఎటువంటి శాశ్వత అభివృద్ధి పనులు చేయలేదన్నారు.దేశానికి ఈ రాష్ట్రానికి దశ దిశ కాంగ్రెస్ పార్టీ అన్నారు,ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందింది అంటే అది ఒక కాంగ్రెస్ పాలనలోనే అన్నారు, ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పుంజుకుని అధికారంలోకి వస్తుందనిఆశాభావం వ్యక్తం చేశారు.

బిజెపి జిల్లా రథసారథిగా ఎల్లంపల్లి ప్రశాంత్

విశాలాంధ్ర -మదనపల్లి: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి ప్రశాంత్‌ను నిమమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ మంగళవారం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సాయిలోకేష్ మాట్లాడుతూ 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు పలు బాధ్యతలను స్వీకరించడం బీజేవైఎం కార్యకర్తగా కార్యవర్గ సభ్యుడిగా, రాష్ట్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ గా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, యువమోర్చా కర్నూల్ జిల్లా ఇన్చార్జిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంతో తిరిగి అతని జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశామన్నారు. ప్రశాంత్ మాట్లాడుతూ ఈ బాధ్యత నాకు ఇచ్చినటువంటి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి జాతీయ నాయకులు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, జాతీయ కార్యదర్శి సత్య కుమార్, రాయలసీమ జోనల్ ఇంచార్జ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా వెంకట శివ నారాయణ, రాజంపేట పార్లమెంట్ ఇన్చార్జ్ చంద్రమౌళి, రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ , జిల్లా రాష్ట్ర కార్యదర్శి నాగోత రమేష్ నాయుడు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుకుంట రమేష్ నాయుడు, రఘురాం రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఇచ్చిన ఒక్క హామి పూర్తిగా అమలు చేయలేని సిఎం జగన్

విశాలాంధ్ర -మదనపల్లి : ఒక్క హామి పూర్తిగా అమలు చేయక చతికలబడిన వైసిపి ప్రభుత్వం 99 శాతం పూర్తి అయినట్లు ప్రచారం చేయాలనుకోవడం, రానురాను రాజు గారి గుర్రం గాడిదలా మారిందనే చందంగా సిఎం జగన్మోహన్ రెడ్డి పాలన సాగుతోందని, కుల్చివేతలతో మొదలైన పాలన ధరల బాదుడుతో సాగుతోందని టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్ విమర్శించారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్లో రాటకొండ మధుబాబు, నవీన్ చౌదరితో కలిసి మాట్లాడారు. ఒక్కహామి పూర్తి చేయకపోయినా 99 శాతం పూర్తి అయినట్లు చెప్పాలని కార్యకర్తలు, నాయకుల సమావేశంలో సిఎం జగన్మోహన్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా వుందన్నారు. మదనపల్లె టౌన్, రూరల్ తోపాటు అన్ని చోట్ల రేషన్ ద్వారా ఇచ్చే నిత్యావసర వస్తువులు సక్రమంగా ఇవ్వడం లేదని ఆర్‌జే వెంకటేష్ ఆరోపించారు. పెదలకు బియ్యం తప్ప పామాయిల్, కందిపప్పు, చెక్కెర తదితర వస్తువులు ఇచ్చిన జాడ లేదని అన్నారు. సన్నబియ్యం ఇస్తామన్న సన్నాసులు దుడ్డబియ్యంతోనే సరిపెట్టారని ఎద్దేవా చేశారు. త్వరలో ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెబుతారన్నారు.

చంద్రబాబు త్వరగా విడుదల అవ్వాలని ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-బి.కొత్తకోట : చంద్రబాబు నాయుడు జైలు నుండి త్వరగా విడుదల అవ్వాలని బి కొత్తకోటలో టిడిపి పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంబళ్ళపల్లి టిడిపి ఇంచార్జ్ జి శంకర్ యాదవ్ ఆదేశాల మేరకు దిగుబస్టాండ్ లో ని ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈసందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాల తో ఉండాలని త్వరగా బెయిలు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బి కొత్తకోట పట్టణ అధ్యక్షులు బంగారు వెంకటరమణ మండల టిడిపి కార్యదర్శి దేవరింటి కుమార్ యూనిట్ ఇంచార్జ్ మోటుకు శివ ఎండి మస్తాన్ సుకుమార్ దేరంగుల నారాయణ దేవుడు నాగరాజు . సురేంద్ర .గట్టు రెడ్డన్న కుడుం రంజిత్ పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదల కావాలని పూజలు ప్రార్థనలు

విశాలాంధ్ర -రైల్వేకోడూరు: తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, ప్రధాన ప్రతిపక్ష నాయకులు మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బెయిల్ మంజూరు కావాలని టిడిపి నియోజక వర్గ ఇన్చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం టిడిపి నాయకులు, నాయకులు, కార్యకర్తలు మహిళలు ఆలయాలలో అర్చకులచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, చర్చిలలో పాస్టర్ చే ప్రార్దన లు , మసీదులలో గురువులచే ప్రత్యేక నమాజ్ చేశారు. మౌన వ్రతంతో ప్రదర్శనలు ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా కస్తూరి మాట్లాడుతూ ఇకనుంచి ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. చంద్రబాబుకు దేవుని ఆశీస్సులు ఉన్నాయి, జైలు నుంచి విడుదలవుతారన్నారు. చంద్రబాబు విడుదల అయ్యేంతవరకు వివిధ పద్ధతులలో ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు కెకె చౌదరి, పులెల రమేష్ బాబు, కమతం నాగరాజు, యర్రగుండ్ల నీలకంఠ య్యా, జయప్రకాష్, డి కృష్ణంరాజు, పోకల మణి, కొమ్మా శివ, పెరుగు కిష్టయ్యనాయుడు, బాలు ఇందిరమ్మ, కటికం సునీత, దుద్యాల అనితాదీప్తి, ఆకెపాటి సుకుమార్ రెడ్డి, పోగూరు శివయ్య,యామల సిద్దేశ్వర, వల్లెపు శివకుమార్,ముక్కర శంకరయ్య, చప్పిడి రమేష్ బాబు, గడికోట సుబ్బరాయుడు, హస్తి చంద్రశేఖరరాజు, నాగినేని వెంకటరమణ, సాలాపక్షి చంద్రశేఖర్, గాంధీనాయుడు, బుంగటావుల రాజశేఖర్,కొమరాల రాజశేఖర్, గుర్రంపాటి మణి, కటకం నాగరాజు, తులసి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో అన్నదానం

విశాలాంధ్ర-రాయచోటి: వీరభద్ర స్వామి దేవస్థానం నందు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ పోలంరెడ్డి విజయమ్మ, ఆలయ ఈవో రమణారెడ్డిలు తెలియజేశారు. శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం నందు మంగళవారం దాతలు చంద్ర వెంకట కేతన్ రాయచోటి వాస్తవ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై ఉక్కు పాదం: సీఐ

విశాలాంధ్ర-మదనపల్లి : స్థానిక మదనపల్లి ప్రెస్ క్లబ్లో విశిష్ట అతిథిగా విచ్చేసిన సిఐ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో గ్రామజ్యోతి సొసైటీ డైరెక్టర్ సుభద్ర సౌత్ ఇండియాలో ఉన్నటు వంటి 64 సంస్థలతో 100 ప్రాంతాలలో ఏ 21 మరియు మూమెంట్ ఇండియా వారి సౌజన్యంతో గత మూడు మాసాలుగా మానవ అక్రమ రవాణా పై యావత్ భారతదేశం మొత్తం అవగాహన కార్యక్రమాలు, మానవహారం రూపంలో ర్యాలీలు అవగాహన సదస్సులు మరియు సాంస్కృతిక కార్యకలాపాల ద్వారా అందరికీ ప్రతి ఒక్కరికి మానవ అక్రమ రవాణా పై అవగాహన కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. సిఐ మాట్లాడుతూ స్థానిక మదనపల్లిలో చిన్న పిల్లలతో భిక్షాటన చేయ డం వృత్తిగా మారిందని వీరందరిని విచారించి వారి తగు సహాయ సహకారాలు అందించి ఏ ఒక్క బిడ్డ కూడా లేదా ఏ యూత్ యువకులు గాని అక్రమ రవాణాకు గురి కాకుండా వారి హక్కులకు భంగం వాటిల్లకుండా స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థలన్నీ సహకరించాలని అందుకు కావలసిన పోలీస్ వ్యవస్థ నుంచి పూర్తి సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. గ్రామ జ్యోతి డైరెక్టర్ సుభద్ర గారు మాట్లాడుతూ గత మూడు మాసాలుగా ఈ మహత్కార్యానికి సహాయ సగాలందిస్తున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదములు కృతజ్ఞతలు తెలిపారు.

వాటర్ గ్రిడ్ పనుల సర్వే

విశాలాంధ్ర -రామసముద్రం: వాటర్ గ్రిడ్ పనులను చేసేందుకు రామసముద్రం మండలంలో మంగళవారం పరిశీలించినట్లు ఆర్డబ్ల్యూఎస్ మండల అధికారి వినోద్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మదనపల్లి డివిజన్ పరిధిలో 27 మండలాలకు 2370 కోట్ల ప్రభుత్వ మంజూరు చేసిందని చెప్పారు. గడచిన ఫిబ్రవరి 9వ తేదీన రాఘవ కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ టెండర్లు దక్కించుకు నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి మంచినీరు సరఫరా చేయడమే వాటర్ గ్రిడ్ లక్ష్యమని తెలిపారు. వాటర్ ట్యాంకు లేని చోట నిర్మించి ఉన్నచోట వాటికే త్రాగునీటి సరఫరా చేసి పైప్లైన్ల ద్వారా వాటర్ ఫిల్టర్ అందిస్తారన్నారు. గండికోట రిజర్వాయర్ నుండి గుర్రంకొండ కు నీరు సరఫరా చేసి అక్కడ నీటి శుద్ధి యంత్రాల ద్వారా నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తారన్నారు కార్యక్రమంలో సర్పంచ్ ఉదయ శంకర్ రెడ్డి మండల సర్వేయర్ నాగరాజ్ వీఆర్వో రెహమాన్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర- రామాపురం: డ్వాక్రా సంఘ సభ్యులు బ్యాంకులో తీసుకున్న డబ్బులను జీవనోపాధికి ఉపయోగించుకోవాలని చేసుకోవాలని అన్నమయ్య జిల్లా డి ఆర్ డీ ఏ పిడి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఎలుగు కార్యాలయంలో మంగళవారం డ్వాక్రా వివో లీడర్లు ఆనిమేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో పేదరిక నిర్మూలన తగ్గించడానికి ఈవో లీడర్లు.అనిమేటర్లకు కృషి చేయాలనీ అన్నారు. బ్యాంకులలో అప్పులు సక్రమంగా సకాలంలో చెల్లిస్తున్న సంఘాలను ఏ గ్రేడ్ చేయలని వెలుగు సిబ్బందికి సూచించారు. సంఘాల్లో తీసుకున్న రుణాలు రికవరీలు సక్రమంగా చెల్లించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 30,500 స్వయం సహాయక సంఘాలకు శ్రీనిధికి రు 112 కోట్లు .బ్యాంకు రుణాలు 261కోట్లు రూపాయలు ఇచ్చామన్నారు. అలాగే రామాపురం మండలంలో 727 స్వయం సహాయక సంఘాల గాను బ్యాంకు రుణాల కింద 2023ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రూ 11 కోట్లు. శ్రీనిధి కింద కోటి 10 లక్షలు. ఉన్నతి ఎస్సీ ఎస్టీ పథకానికి రూ 60 లక్షలు. సిఐఫ్ కింద హౌసింగ్ లో రూ 41 లక్షలు 332 మంది లబ్ధిదారులకు ఇవ్వడం జరిగింది అన్నారు. జగనన్న తోడు కింద తోడు 30 5 మంది గాను ఒక్కొక్కరికి రూ 10 వేలు రూపాయలు చొప్పున రూ 35 లక్షల 50 వేల రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు. సంఘ సభ్యులు తీసుకున్న రుణాలు ప్రతినెల క్రమం తప్పకుండా కట్టే విధంగా గ్రూపు లీడర్లు వేలుగు సిబ్బంది చూడాలన్నారు. బ్యాంకు నుంచి అప్పు తీసుకొని సక్రమంగా కట్టిన సంఘాలకు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం దేవసేన. సీసీలు. ఆనీమీటర్లు. ఈవో లీడర్లు. మహిళా సంఘాలు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్దోషిగా బయటకు రావాలి
పీలేరు టిడిపి ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు

విశాలాంధ్ర-పీలేరు:- యా...అల్లా... తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నిర్దోషిగా బయటకు రావాలని పట్టణంలోని జెండా మాను వీధిలో టిడిపి ముస్లిమ్స్ మైనార్టీ నాయకులు నల్లారి రియాజ్,ఎన్టీఆర్ నఫీస్, మహమ్మద్ పీర్,షౌకత్ అలీ,బావాజీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 సంవత్సరాల రాజకీయ ఉద్దంటాడు, మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబు నాయుడు పై వైసీపీ ప్రభుత్వం కక్ష కట్టి అక్రమంగా కేసులు బనాయించి నేటికి నెల రోజులయ్యిందని ప్రజాస్వామ్యాన్ని వైసిపి ప్రభుత్వం ఖూనీ చేస్తున్నదని చట్టాలను తమ చేతిలోకి తీసుకొని ఇష్టానుసారంగా వ్యవహరి వ్యవహరిస్తున్నదని, న్యాయమంటూ ఒకటి ఉంటుందని అది చట్టం కూడా తన పని తాను చేసుకుంటూ చివరికి న్యాయమే గెలిచి తమ నేత నారా చంద్రబాబు నాయుడు నిర్దోషిగా బయటకు వచ్చి 2024 సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం తధ్యమని ముస్లిమ్స్ మైనార్టీలు తమ ఆశాభావాన్ని వ్యక్తపరిచారు.

ఆరోగ్య సురక్ష ప్రజలకు ఓ వరం: కమిషనర్

విశాలాంధ్ర-బి కొత్తకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని మున్సిపల్ కమిషనర్ మనోహర్ అన్నారు మంగళవారం బీసీ కాలనీలోని సచివాలయంలో జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా ఆయన హాజరై ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల్లో మంచి స్పందన వస్తుందనిఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రజలు పలు టెస్టులు చేయించుకొని సంబందించిన మందులు తీసుకోవచ్చు అన్నారు. ఎవరైనా డాక్టర్ పరీక్షల ద్వారా వివిధ హాస్పటల్లో చికిత్స పొందాలంటే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందవచ్చు అన్నారు. ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి డాక్టర్ శంకర్ . డాక్టర్ విమల డాక్టర్ సాయి. డాక్టర్ రిచర్డ్ లు దాదాపు 500 మందికి పైగా వైద్యం అందించి బిపి షుగర్ కంటి వైద్యం పలు రకాల వైద్య సేవలు అందించారు. అనంతరం కరోనా సమయంలో ప్రజలకు సేవలు అందించిన ఆశ వర్కర్లకు ఏఎన్ఎం లకు బీసీ కాలనీ సచివాలయ కన్వీనర్లు ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏవో రమాదేవి ఆర్ఐ శ్రీనివాసులు ఎం.ఎల్.హెచ్.పి లు పవిత్ర .సుజిత. నాయకులు ఎస్ఎస్ ఫయాజ్ నక్క మహేష్ .నబ్బి. పవన్ పాగుండ రఫీ అంగన్వాడి సిబ్బంది శ్యామల తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలి :తహశీల్దారు

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి కోరారు. మంగళవారం కె.బుడుగుంటపల్లి గ్రామపంచాయతీ గ్రామ సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ధ్వజారెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చి ఎంతోమంది పేదలలో వెలుగు నింపారన్నారు. తండ్రి ప్రవేశపెట్టిన పథకాలనే కాకుండా తనయు డు అదనంగా మరికొన్ని పథకాలను చేర్చి ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. తహసిల్దారు బి.రామమోహన్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని కోరారు.మండలంలో 45 రోజులు పాటు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఎంపిడిఓ జాషువా, జడ్పిటిసి పాలెంకోట రత్నమ్మ, సర్పంచి దార్ల చంద్రశేఖర్, పంచాయితీ సెక్రెటరీ మహేష్, వివి కండ్రిక సర్పంచ్ శ్రీరామ్ వినోద్, మల్లు కృష్ణారెడ్డి, కంచర్ల రమణారెడ్డి, సింగమాల రాజగోపాల్, తిరుపతి సూరి, ఆశా వర్కర్లు, సిహెచ్ఓ లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్దోషిగా బయటకు రావాలి
101 కొబ్బరికాయలు కొట్టిన తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర-పీలేరు:- చంద్రబాబు నిర్దోషిగా బయటకు వస్తారని రాజంపేట నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి కోటపల్లి బాబు రెడ్డి,టీడీపీ సీనియర్ నాయకులు,రాష్ట్ర బీసీ సాధికారక కమిటీ కార్యదర్శి పురం రామ్మూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాటలాడుతు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి,తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబు నాయుడు వైసీపీ ప్రభుత్వం కక్ష కట్టి అక్రమ కేసు బానయించారని, తమనేత చంద్రబాబు కడిగిన ముత్యంలా,నిర్దోషిగా బయటకు రావాలన్న నేపథ్యంలో పీలేరు లోని తిరుపతి రోడ్డు చౌడేశ్వరి దేవి ఆలయంలో నూట ఒకటి కొబ్బరికాయలు కొట్టి పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పీలేరు టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, టీడీపీ శ్రేణులు,కార్యకర్తలు,నల్లారి కిషోర్ అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

175/175 వైసీపీకి సాధ్యమే జగనన్ననే మళ్ళీ సీఎం కావాలి

విశాలాంధ్ర-పీలేరు:- 175/175 వైసీపీ కి సాధ్యమే జగనన్ననే మళ్ళీ సీఎం కావాలని వైసీపీ సీనియర్ నాయకులు,మాజీ జడ్పీటీసీ,పెద్దిరెడ్డి కుటుంబా నికి నమ్మిన బంటు జయ రామచంద్రయ్య(జయన్న) అన్నారు. జగన్ననే ఎందుకు కావాలి అంటే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం. జగన్మోహనరెడ్డి సహెరాసా పెతంగా వైస్సార్ పెన్షన్ పెంపు,జగనన్న అమ్మ ఒడి,వైస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన,జగనన్న గోరుముద్ద, వైస్సార్ లా నేస్తం, పోలీసులుకు వీక్లీ ఆఫ్.%ాజ% ని గవర్న మెంట్లో విలీనం, అగ్రిగోల్డ్ బాధితులుకు అండగా మొదటి విడత డబ్బులు జమ. రివర్స్ టెండెరింగ్.(ఇరిగేషన్ ప్రాజక్టులలో 1500 కోట్లు పైగా ఆదా, అక్రమకట్టడాలు కూల్చివేత. వైస్సార్ ఆరోగ్య శ్రీ.వైస్సార్ వాహన మిత్ర,వైస్సార్ నేతన్న హస్తం,మత్స్యకార భరోసా,వైస్సార్ ఆరోగ్య ఆసరా,25 లక్షల పేదలకు ఉగాది నాటికి ఇళ్ళ స్థలాలు, గ్రామ సచివాలయం, వాలంటీర్ వ్యవస్థ, వైస్సార్ జీవన భీమా,కౌలు రైతులకు కూడా రైతు భరోసా 4 లక్షల వాలంటీర్ ఉద్యోగాలు, 1 లక్ష 27 వేల శాశ్వత ఉద్యోగాలు,5 డిప్యూటీ సీఎం లు ఇలా ఇన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన చేస్తున్నారని జయరామచంద్రయ్య అన్నారు.

ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్న రమేష్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని రాయచోటిలోని స్థానిక చర్చి ,స్థానిక దర్గా మరియు సాయిబాబా దేవాలయంలలో ప్రత్యేకమైనా ప్రార్థన ,దువా కార్యక్రమం, పూజలలో నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే, రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఆర్ రమేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నరు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా , షేక్ ఖాదర్ వలీ ,వతన్ ,సత్యా రెడ్డి , నిస్సార్ ,చలపతి ,అమర్నాథ్ రెడ్డి , చిన్న రేడ్డెయ్య ,గంగయ్య ,వాసు , గంగి రెడ్డి , అణగాని రెడ్డేయ్యా,మాబువలి ఖాన్ , అత్తా వుల్లా మరియు తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .